ప్రజాశక్తి

ఆదివారం 8 జనవరి 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వైసిపి ఎంపిటిసి ఇంట్లో

15 కిలోలు..

గంజాయి రవాణాలో ఆయనదే కీలకపాత్ర..



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలోని సూర్యలంక కేంద్రంగా సాగిన గంజాయి అక్రమ రవాణా కేసులో విచారణ చేపట్టిన పోలీసులు ఇందులో ఒక సూత్రధారిని గుర్తించారు. చినగంజాం మండలం, మోటుపల్లికి చెందిన వైసిపి ఎంపిటిసి గోవిందును శనివారం అదుపులోకి తీసుకున్నారు. దాదాపు 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు..

చాలా కాలంగా సముద్రతీర ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రధానంగా తీర ప్రాంతంలో ఉన్న సూర్యలంక, వాడరేవు, రామాపురం, మోటుపల్లి ప్రాంతాలతో పాటు, కళాశాలలు, రైల్వేస్టేషన్‌లు కేంద్రాలుగా చేసుకున్న కొందరు జోరుగా గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. తీరంలో పర్యాటకుల తాకిడి అధికంగా ఉండటంతో కార్లు, ఆటోలలో కిలోల లెక్కన తీరానికి చేర్చి పర్యాటకులు, విద్యార్థులు, యువతకు గంజాయిని అలవాటు చేస్తున్నారు. బాపట్ల జిల్లాగా ఏర్పడిన కొత్తల్లో సూర్యలంకలో పోలీసులు అక్కడి దుకాణాల్లో జరిపిన సోదాల్లో గంజాయి దొరికింది. విచారణలో విశాఖ మన్యం నుంచి పెద్ద ఎత్తున గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు తేలింది. దీనిపై పోలీసులు దృష్టి సారించగా.. గత నెలలో ఇద్దరు యువకులు గంజాయిని తరలిస్తూ పట్టుబడ్డారు. తనిఖీలు జరుపుతున్న ప్రతిసారీ గంజాయి దొరుకుతూనే ఉంది. దర్యాప్తు చేపట్టిన బాపట్ల రూరల్ పోలీసులకు సదరు యువకుల ద్వారా స్టువర్టుపురానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించారు. తాను మోటుపల్లి నుంచి గంజాయి తెచ్చి విక్రయిస్తున్నట్లు చెప్పడంతో పోలీసులు సదరు వ్యక్తి ఇంటిపై దాడి చేయగా సుమారు 15 కిలోల గంజాయి దొరికింది. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను ఆ గ్రామ వైసిపి ఎంపిటిసి అని తేలింది. పోలీసుల అదుపు లో నుంచి అతన్ని విడిపించేందుకు అధికార పార్టీ నేతల నుంచి సిఫార్సులు వచ్చినట్లు తెలుస్తోంది.

గంజాయి సూత్రధారులెవరు?

- జనంలోకి ఎలా వస్తోంది?
- తెరచాటున రూ.కోట్లల్లో వ్యాపారం
- కూలీలతో పాటు యువతకు కూడా అలవాటు చేసిన దళారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

- 'ఒంగోలు నగరంలో గంజాయి వాడకం బాగా పెరిగిందని ప్రజలు చెబుతున్నారు. దీనిపై గట్టిగా నిఘా పెట్టండి.' అని మాజీ మంత్రి బాలినేని ఇటీవల 33వ వార్డులో గడపగడప కార్యక్రమం సందర్భంగా ఎస్పీకి ఫోన్ చేసి చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులతో ఆయన స్పందించి.. గంజాయి అక్రమ రవాణాపై కఠినచర్యలు తీసుకోవాలని ఎస్‌పిని కోరారు.

- విశాఖ జిల్లా నుంచి తరలిస్తున్న గంజాయి 66 కిలోలను మద్దిపాడు మండల పరిధిలో పట్టుకున్నట్లు ఎస్పీ మల్లికాగర్గ్ శనివారం మీడియా సమావేశంలో వెల్లడించారు. గంజాయి స్మగ్లర్లు తప్పించుకోలేరని హెచ్చరించారు.



66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని.. మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

గంజాయి ఎలా వస్తోందో ఎవరికీ అంతు చిక్కడం లేదనుకుంటే పొరపాటే. ఇదీ ఒక మాఫియానే. సిగరెట్లలో దీన్ని కలిసి విక్రయాలు చేస్తున్నారు. ఇపుడు యువత దీన్ని విచ్చలవిడిగా వాడుతున్నారు. కొన్ని ప్రాంతాలను ఎంపిక చేసుకుని గుట్టుగా విక్రయాలు చేస్తున్నారు. ఇదంతా పోలీసులకు తెలిసినా తెరచాటున పెద్ద పెద్ద వాళ్లు సూత్రదారులుగా ఉన్నందున ఏమీ చేయలేని పరస్థితి కూడా ఉంది. గంజాయి నిషేధిత మారకద్రవ్యంగా ఉంది.దీంతోపాటు గుట్కాలు, నాటు సారాను కూడా నిషేదించారు.అయితే ఇవి యదేచ్ఛగా అమ్మకాలు జరుగుతున్నాయి. తయారు చేస్తున్నారు. గంజాయిని పండిస్తున్నారు. పండించి రవాణా అయ్యే వరకూ నిఘా వ్యవస్థలు ఏమిచేస్తున్నాయన్నదే ఇపుడు ప్రశ్న. ఇటీవల వరకూ గంజాయి వాడకం పెద్దగా లేదు.ఎక్కడో అటవీప్రాంతాల్లోనే ఉంది. ఇపుడు పట్టణాలకు యదేచ్ఛగా చేరుతోంది. అడవుల్లో పండించిదీన్ని పట్టణాలకు తెస్తున్నారు. బడ్డీ కొట్ల నుంచి అమ్ముతున్నారు. కొందరు దీన్ని తెచ్చి పొట్లాలు తయారు చేసి ఈకొట్లకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడ నుంచీ సిగరెట్ల కోసం వచ్చే యువతకు చేరవేస్తున్నారు. ఒకసారి గంజాయి తాగితే మళ్లీ దాన్ని మరిచిపోవడం అంత సులువు కాదంటున్నారు. బానిసలుగా మారుతున్నారు. మద్యం మత్తు చాలడం లేదని గంజాయి తాగుతున్నారని చర్చ సాగుతోంది. ఏదేమైనా గంజాయిని పట్టుకోవడం హర్షించదగ్గ విషయమే..

▶ 2లో

స్మగ్లర్లు తప్పించుకోలేరు: ఎస్‌పి

66 కిలోల గంజాయి స్వాధీనం

ఒంగోలు క్రైం: గంజాయిని స్మగ్లర్లు మా కళ్ల నుండి తప్పించుకోలేరని ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. గంజాయి స్మగ్లింగ్ చేసే ఆరుగురు సభ్యుల ముఠాను మద్దిపాడు పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. వారి వద్ద నుండి 66 కిలోల గంజాయి, కారు ఒక ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్‌పి కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఎస్‌పి వివరాలు వెల్లడించారు.

కడప జిల్లా, సికె దిన్నె, ఎంఎంఎస్ బిడియ గ్రామానికి చెందిన ఆవుల రాము, ఒంటిమిట్ట మండలం, మాధవరం గ్రామానికి చెందిన పడిగ దేవతి, మేకల అలివేలు, పాటూరి నరసింహులు, అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన కోర్ర సంజీవరావు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మోటుపలక కొసపురెడ్డిలు ముఠాగా ఏర్పడ్డారు. వీరు విశాఖ

▶ 2లో

చీకటి జీవోను రద్దు చేయాల్సిందే..

- ప్రజాస్వామ్య హక్కుల్ని కాలరాస్తున్న ప్రభుత్వం
- ఓటమి భయంతోనే జీవో నెంబర్ 1 జారీ
- కలెక్టరేట్ వద్ద జీవో ప్రతుల దహనం
- ఒంగోలులో వామపక్షాల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తుందని, జారీ చేసిన చీకటి జీవోను రద్దు చేయాలని వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజల నుండి వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే జీవో నెంబర్ 1 ని తీసుకొచ్చారని ధ్వజమెత్తారు. జీవో నెంబర్ ఒకటికి వ్యతిరేకంగా స్థానిక మల్లయ్య లింగం భవనం నుండి కలెక్టరేట్ వరకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం నిరసన ర్యాలీ జరిగింది. అనంతరం జీవో నెంబర్ 1 ప్రతులను వామపక్ష నేతలు దహనం చేశారు. కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి జి.రమేష్, సిపిఐ నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ, నియంత పాలన సాగించేందుకు ఇటువంటి చెత్త జీవోలను తెస్తోందన్నారు. నాడు స్వాతంత్ర సంగ్రామంలో ఆ పోరాటాన్ని అణిచివేసేందుకు బ్రిటిష్ వాళ్లు 1861 పోలీసు యాక్ట్ 30ని తిరిగి జగన్ ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని వెనక్కి నడిపిస్తున్నారన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

జీవో నెంబర్ ఒకటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలకు ఈ జీవో వర్తిస్తుందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకష్ణారెడ్డి ప్రకటిస్తుంటే, మరోపక్క రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ శుక్రవారం లో రోడ్లపై భారీ ర్యాలీ, ప్రారంభోత్సవాలు జరుపుకున్నారని ఈ జీవో అధికార పార్టీకి వర్తించదా? అని ప్రశ్నించారు. కేవలం ప్రతిపక్షాల కార్యక్రమాలను అడ్డుకునేందుకు ఈ జీవోను తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరితో పాలన వెంటనే ప్రజల హక్కులను హరించే జీవో నెంబర్ ఒకటిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవోను ఉపసంహరించుకునేంత వరకు పోరాటం ఆగదని పునరుద్ఘాటించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ జీవో నెంబర్ 1 ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని, ప్రభుత్వంపై ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు



జీవో ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా పోరాటాలను, ఉద్యమాలను పోలీసు ద్వారా అణగదొక్కేందుకు చూస్తోందన్నారు. ప్రజా హక్కులను బలవంతంగా నిర్వీర్యం చేసేందుకే జీవో నెంబర్ ఒకటిని రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. కందుకూరు, గుంటూరులలో జరిగిన ఘటనలను ఆధారం చేసుకుని బ్రిటీష్ కాలం నాటి చట్టాలను తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను మరింత బానిసలుగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు. ఇటువంటి జీవోలను ప్రజాస్వామిక వాదులు, మేధావులు, విద్యావంతులు,

▶ 2లో



విద్యారంగ సమస్యల పరిష్కారంలో

ప్రభుత్వం విఫలం

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్న కుమార్ ధ్వజమెత్తారు. ఎస్‌ఎఫ్‌ఐ 44వ జిల్లా మహాసభలు మార్కాపురంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ప్రారంభమయ్యాయి. మహాసభ ప్రారంభ సూచికగా స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాలతో కూడిన జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన మహాసభకు అధ్యక్ష వర్గంగా విజయ్, బ్రహ్మచారి, దేవరాజ్, జీవన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని కాషాయీకరణ, ప్రైవేటీకరణ దిశగా తీసుకెళుతోందన్నారు. కేంద్రానికి వంత పాడేలా రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యారంగాన్ని అభివద్ధి చేసేందుకు తీసుకువచ్చిన పథకాలన్నీ ఆచరణలో విద్యారంగాన్ని వెనక్కు తీసుకువెళ్లే పథకాలుగా మారాయని ఆరోపించారు. జీవో నెంబర్ 77 తీసుకువచ్చి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం

▶ 2లో

మార్గదర్శకాల అమలులో నిర్లక్ష్యం వహించొద్దు

అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి: కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ● ఎపిపిఎస్‌సి పరీక్షల ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎపిపిఎస్‌సి జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయడంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అధికారులను హెచ్చరించారు. స్థానిక ఏకెవికె జూనియర్ కళాశాలలో ఆదివారం జరగనున్న ఎపిపిఎస్‌సి పరీక్షల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభ్యర్థులు స్మార్ట్ వాచీలు, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రంలోకి తీసుకువెళ్లకుండా క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించాలని స్పష్టం చేశారు. సీట్ల కేటాయింపు, పరీక్షా పత్రాల పంపిణీ, పరీక్ష పూర్తయ్యాక వాటి బండ్లింగ్, సీలు విషయాలలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అభ్యర్థులకు, ముఖ్యంగా వికలాంగులకు అవసరమైన అన్ని సదుపాయాలను పరీక్షా కేంద్రంలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం పరిసరాలలో 144 సెక్షను అమలు చేసి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రంలోని సిసి కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట డిఆర్‌ఓ బి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ నరసింహం, మున్సిపల్ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏకెవికె జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

నగరంలో 50 చేపల విక్రయ కేంద్రాలు: కమిషనర్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ప్రభుత్వం చేపట్టిన ఫిష్ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఒంగోలు నగరంలో సుమారు 50 చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఫిష్ ఆంధ్ర కార్యక్రమం గురించి చేపల వ్యాపారులు, సచివాలయ వెల్‌ఫేర్ సెక్రటరీలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పట్టణ ప్రజలకు నాణ్యమైన చేపలు, రొయ్యలు, పీతలు అందించాలని ప్రభుత్వం ఫిష్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని తీసుకు వచ్చిందన్నారు. దీన్ని సాకారం చేయాలంటే చేపల విక్రయ కేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచాల్సిన అసరం ఉందన్నారు. అందులో భాగంగా నగరంలో సుమారు 50 చేపల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సుమారు కోటి రూపాయల వ్యయంతో ఆక్వా హబ్ కూడా నెలకొల్పుతామని చెప్పారు. ఆక్వా హబ్ నిర్మాణానికి విక్రయదారులు వారి ఆసక్తిని తెలియజేయాలని కోరారు. మత్స్య విక్రయ కేంద్రాలు ఏర్పాటుకు ఒక్కో కేంద్రానికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనాలు వేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, పలువురు మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు

రబ్బరు పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-పంగులూరు

శనగ పంటలో రబ్బర్ పురుగు వచ్చి పంట మొత్తాన్ని నాశనం చేసే పరిస్థితులు ఉన్నాయని, ఈ పురుగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి దేవరపల్లి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. రబ్బరు పురుగును నివారించకపోతే శనగ రైతులు బాగా నష్టపోయే పరిస్థితులు ఉన్నాయని ఆయన అన్నారు. రబ్బరు పురుగు మొగ్గ దగ్గర పత్రహరితాన్ని గోకి తిని నష్టం కలుగజేస్తుందని, పైరు తొలిదశలో ఎక్కువగా ఆశించి నష్టపరుస్తుందని అన్నారు. దీని ఉధృతి ఎక్కువైనప్పుడు ఆకులు పాలిపోయి రాలిపోతాయని, ఎప్పుడైతే బెట్ట వాతావరణం కలిగి, తర్వాత అధిక వర్షపాతం నమోదు అయినప్పుడు, తొలి 20-25 రోజులలో రబ్బరు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుందని సుబ్బారెడ్డి చెప్పారు. దీని నివారణకు క్వినాల్‌ఫాస్ 25శాతం ఇ.సి. 2 మి.లీ. లీటరు నీటికి, లేదా క్లోరిపైరిఫాస్ 20% ఇ.సి.2.5 మి.లీ. లీటరు నీటికి, లేదా నొవాల్యురాన్ 10శాతం ఇ.సి. లేదా డైఫ్లూబెంజురాన్ 25 శాతం డబ్ల్యు.పి. 1 మి.లీ. లీటరు నీటికి మందును కలిపి పురుగు ఉధృతిని బట్టి 2-3 సార్లు 4-5 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలని పేర్కొన్నారు.


చందలూరులో ఏపుగా పెరిగిన శనగ పైరు

చీకటి జీవోను రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఖండించాలని పిలుపునిచ్చారు. ఓటమి భయంతోనే ఈ జీవోను జగన్ తీసుకువచ్చారని, వెంటనే ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదన్నారు. సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి డివిఎన్ స్వామి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలకు కల్పించిన స్వేచ్ఛ హక్కుకు భంగం వాటిల్లేలా జగన్ ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 1 ఉందన్నారు. సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల జగన్ పాలనలో ప్రజలలో వస్తున్న అసంతృప్తిని కప్పిపుచ్చుకునేందుకు ఈ జీవోను జగన్ తెచ్చారన్నారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, జిల్లా నాయకులు జివి కొండారెడ్డి, ఎం.రమేష్, బి.రఘురామ్, శ్రీరామ శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసులు, ఎస్‌డి హుస్సేన్, ఏ.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ వెంకట్రావు, ఒంగోలు నగర కార్యదర్శి పివిఆర్ చౌదరి, జిల్లా నాయకులు ఆర్ రామకష్ణ, ఎం విజయ, సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి ఎస్.లలిత కుమారి, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు ఆర్ మోహన్, అఖిల భారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.నాగరాజు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

గంజాయి సూత్రధారులెవరు?

(మొదటిపేజీ తరువాయి)

అయితే ఇది మార్కెట్‌లోకి వచ్చే మార్గాలు, తెచ్చే మూలాలపై దృష్టిసారించాల్సి ఉంది.

1100 గ్రాముల గంజాయి స్వాధీనం

పొదిలి: పొదిలి పట్టణంలో నలుగురు వ్యక్తుల నుండి 1100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసినట్లు స్థానిక సెబ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కె ఖాజా మోహిద్దీన్ తెలిపారు. శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పొదిలి ప్రకాష్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఇట్ల తిరుపతయ్య, అతని భార్య ఇట్ల లలితల నివాసంపై దాడి చేసి.. వారి వద్ద నుండి 700 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. పొదిలి పిచ్చిరెడ్డి తోటలో నివాసం ఉంటున్న పాలకీర్తి నాంచారయ్య వద్ద నుండి 200 గ్రాములు, దర్శి ముస్లిం బజారు లో నివాసం ఉంటున్న షేక్ మస్తాన్‌వలీ వద్ద నుండి 200 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకొని.. వారిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. ఈ నలుగురికీ కందుకూరులో నివాసం ఉంటున్న గురునాథం సిద్దయ్య అనే వ్యక్తి గంజాయిని సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. దాడుల్లో స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజామొహిద్దీన్, సబ్ ఇన్స్పెక్టర్ పి.రాజేంద్రప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ హసీం, కానిస్టేబుల్స్ గురవయ్య, చలపతి, కోటేశ్వరరావు, వెంకటరావు, శ్రీనివాసులు మరియు పున్నమ్మ పాల్గొన్నారు.

స్మగ్లర్లు తప్పించుకోలేరు: ఎస్‌పి

(మొదటిపేజీ తరువాయి)

ఏజెన్సీ ప్రాంతం, చింతపల్లి గ్రామం నుంచి చిత్తూరు, కడప జిల్లాలలో కూలీలకు అమ్మేందుకు తీసుకువెళుతున్నారు. వీరు ఒక కారులో 34 కేజీలు, ద్విచక్రవాహనంపై 16 కేజీలు, మరో వ్యక్తి ఇంకో 16 కేజీలు తీసుకుని వస్తున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్), ఒంగోలు డిఎస్పీ, ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మద్దిపాడు, చీమకుర్తి, సంతనూతలపాడు ఎస్‌ఐలు, ఒంగోలు ఎస్‌ఇబి ఆధ్వర్యంలో మద్దిపాడు డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒలు, హైవే మొబైల్ సిబ్బంది కలసి గుంటూరు నుండి ఒంగోలు వెళ్లు ఎన్‌హెచ్-16 హైవేపై రోడ్ రాచవారిపాలెం గ్రామానికి వెళ్ళు క్రాస్ రోడ్డు దగ్గర నాకా బందీలో భాగంగా వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరు మహిళలతో సహా ఆరుగురు వ్యక్తులు ఈ గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. గంజాయిని, వాహనాలను స్వాధీనం చేసుకొని ఆరుగురినీ అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రతిభ కనపరచిన ఒంగోలు డిఎస్‌పి యు.నాగరాజు, ఒంగోలు రూరల్ సిఐ ఆర్.రాంబాబు, మద్దిపాడు ఎస్‌ఐ శ్రీరామ్, సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.



మద్దిపాడు ఎస్‌ఐ శ్రీరామ్‌ను అభినందిస్తున్న ఎస్‌పి మలికగర్గ్

ప్రభుత్వం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

చేసిందన్నారు. అమ్మ ఒడికి సవాలక్ష ఆంక్షలు పెట్టారన్నారు. ప్రకాశం జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీకి నిధులు కేటాయించక నేటికీ కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కాపురంలో పిజి కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని, ప్రకటించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణం పూర్తి స్థాయిలో పనులు చేపట్టలేదన్నారు. హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు లేక అర్థాకలితో అలమటిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులు ఎన్నో రకాల సమస్యలతో అల్లాడిపోతుంటే.. ప్రభుత్వం మాత్రం మాది సంక్షేమ రాజ్యం అని గొప్పలు చెప్పుకుంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులు పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వినోద్ ఈ సంవత్సర కాలంలో జరిగిన కార్యకలాపాల రిపోర్టును ప్రవేశపెట్టారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిచ్చయ్య, బాబు, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షులు కంకణాల ఆంజనేయులు, మాజీ నాయకులు సోమయ్య సౌహార్ధ సందేశాన్ని ఇచ్చారు. మహాసభలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిహెచ్‌సి పరిధిలో టీబీపై సర్వే

ప్రజాశక్తి-నిజాంపట్నం

మండలంలోని కూచినపూడి పంచాయతీ పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది టీబీ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఎవరికైనా వ్యాధి లక్షణాలు ఉన్నాయా అని పరిశీలించారు. టీబీ బాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వ్యాధి అని, ఈ వ్యాధి బారి న పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కూచినపూడి పీహెచ్‌సి సూపర్ వైజర్ మురళి తెలిపారు. రెండు వారాలకి మించి దగ్గు ఉన్నా, అకారణంగా బరువు తగ్గు తున్నా వెంటనే వైద్య పరీక్షలు చేయించు కోవాలని సూచించారు. వ్యాధిని ముందుగానే నిర్ధారిస్తే నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకటేశ్వరరావు, చంద్ర, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పేదలకు భరోసానిస్తున్న ప్రభుత్వం: జూపూడి

ప్రజాశక్తి-శింగరాయకొండ

రాష్ట్రంలో జగన్ పరిపాలన పేదలకు భరోసా కల్పిస్తోందని, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారులు, వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. శింగరాయకొండ పర్యటనలో భాగంగా శనివారం నాడు ఆయన రాష్ట్ర వైద్య విభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి ఆరోగ్యం బాగాలేక పోవడంతో ఆయన పరామర్శించారు. అనంతరం మూలగుంట పాడు సర్పంచ్ డాక్టర్ బత్తుల శివరామరెడ్డిని కలిసి పరామర్శిం చారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన పేద ప్రజలకు భరోసా కల్పించే విధంగా ఉందన్నారు. ప్రతి పేదవారికి ఎవరి సిఫార్సు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. పరిపాలనను చిన్న వయసులోనే ఛాలెంజిగా తీసుకొని పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బత్తుల అశోక్ కుమార్‌రెడ్డి, శీలం రాము, పొడపాటి అరుణ,



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జూపూడి

బొట్ల రామారావు, యనమల మాధవి, దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, ఉపేంద్ర చౌదరి, దీవి శ్రీనివాసరావు, పారిశ్రామిక చింతల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల వైసీపీ నాయకులు హాజరయ్యారు.



తహశీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న పివి శేషయ్య

గృహ హక్కు ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి-కనిగిరి

గృహ హక్కు పత్రాల పంపిణీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిపిఎం జిల్లా నాయకులు పివి శేషయ్య ఆధ్వర్యంలో కనిగిరి మండలం ఏరువారిపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు గ్రామ సర్పంచ్‌తో కలిసి శనివారం తహశీల్దారు వి పుల్లారావుకు వినతిపత్రం అందజేశారు. గతంలో పక్కాగృహాలు నిర్మించుకొన్న 13మంది లబ్ధిదారుల నుంచి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద రూ.1.30 లక్షలు నగదు వసూలు చేశారని పేర్కొన్నారు. 13 నెలలు గడిచినా ఇంతవరకు జగనన్న సంపూర్ణ భూహక్కు పథకం ధృవీకరణ పత్రాలు ఇవ్వకపోవటంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డి వెంకటయ్య, లబ్ధిదారులు బత్తుల శ్రీనివాసులు, రామారావు, తిరుతపయ్య, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, ఏడుకొండలు, రాములు, రామచంద్రయ్య, కృష్ణయ్య, బాబు, రమేష్, రవి, దత్తాత్రేయ, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి..

ఎనిమిది మందికి గాయాలు

ప్రజాశక్తి-కంభం రూరల్

కంభం మండలం సైదాపురం గ్రామసమీపంలో ఉపాధి కూలీలు వెళ్తున్న ఆటో బోల్తా పడ్డ సంఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఈ ఘటనలో తొమ్మిది మందికి తీవ్రగాయాలు కాగా వారిని స్థానికులు 108 వాహనంలో కంభం ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. వారిలో ఒక మహిళ మృతి చెందింది. కంభం పట్టణంలోని లాడ్ ఖాన్ వీధికి చెందిన మేకల అనంతలక్ష్మిని మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలిస్తుండగా మృతి చెందినది. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో ఆటోలో మొత్తం 20 మంది



మృతిచెందిన మహిళ

కూలీలు ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని యువకుడు మృతి

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండలంలోని పి గుడిపాడు గ్రామ పరిధిలోని అనూష మినరల్ గ్రానైట్ ఫ్యాక్టరీలోని వేస్ట్ వాటర్ నిల్వ ఉంచే తొట్టిలో పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆ వ్యక్తి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల లోపు వుంటుందని, జీన్స్ ప్యాంటు, షర్టు ధరించి ఉన్నాడని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

అతని వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పించన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

150 కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-పిసిపల్లి: మండలం మొత్తం మీద 150 నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపిపి అత్యాల జఘన్య తెలిపారు. శనివారం కొత్తగా మంజూరైన పింఛన్లను పిసిపల్లి ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో అర్హులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ డివి రమణారెడ్డి, జడ్‌పిటిసి లక్ష్మీకాంతంకేరెడ్డి, ఇఓఆర్‌డి నాగమల్లేశ్వరి, పిసిపల్లి సర్పంచి టి మరియమ్మ, పెదఇర్లపాడు సర్పంచి పోలం లక్ష్మీదేవి, వెల్ఫేర్ అసిస్టెంట్ వాణిప్రియారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



హుండీ లెక్కిస్తున్న దృశ్యం

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయకొండ వరహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. గత ఆరు నెలల హుండీ లెక్కించగా రూ.5,52,725 ఆదాయం వచ్చిందని కార్య నిర్వహణ అధికారి కృష్ణవేణి తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు, సభ్యులు గోకరాజు పాపయ్య, నాయుడు చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పెదగంజాంలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీలో శనివారం నాడు పారిశుధ్య పనులు నిర్వహించినట్టు కార్యదర్శి మేడికొండ భారతి తెలిపారు, గ్రామంలో పల్లెపాలెం, పెదగంజాం తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ పనులు, రోడ్డు పక్క చిల్లచెట్లు, గడ్డి తొలగించారు. ప్రతి శనివారం పంచాయతీ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి గ్రామంలో బ్లీచింగ్, సున్నం చల్లి దోమల వలన అంటు



పెదగంజాంలో శానిటేషన్‌పై స్పెషల్ డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్న కార్యదర్శి భారతి

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కార్యదర్శి భారతి తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

రహదారి పక్కనే నేల బావి

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని సంతమాగులూరు, మిన్నేకల్లు గ్రామాల మధ్య ఉన్న రహదారికి మిన్నేకల్లు సమీపంలో రహదారిని ఆనుకుని 20 అడుగుల లోతులో నేల బావి ఉంది. అధికారులు ఎలాంటి హెచ్చరిక బోర్డులు కూడా పెట్టలేదు. ఈ రహదారి సంతమాగులూరు నుంచి కోటప్పకొండ, చిలకలూరిపేట వైపు నిత్యం ఆటోలు, మోటారు సైకిళ్లపై, ప్రయాణికులు వెళుతుంటారు. అంతేగాక ఈ రహదారి గుండా గురిజేపల్లి నుంచి గ్రానైట్ లోడుతో లారీలు నిత్యం సంతమాగులూరు వైపు వెళుతుంటాయి. ఎవరైనా రాత్రులందు ఆదమరిస్తే అంతే సంగతులని పలువురు తెలుపుతున్నారు. మిన్నేకల్లు గ్రామంలోని కొందరు రైతులు వేసవికాలంలో తోటకూరలు సాగు చేసేందుకు రోడ్డు పక్కన 20 అడుగుల లోతులో 15 సంవత్సరాల క్రితం నేలబావిని తవ్వారు. ఇప్పుడు ఆ బావి కింద ఎలాంటి పంటలూ సాగు చేయడం లేదు. నిరుపయోగంగా ఉంది. రైతులు ఆ బావిని పూడ్చలేదు. దీంతో అక్కడ వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా



రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న నేలబావి

అధికారులు స్పందించి నేలబావిని పూడ్చేలా చర్యలు తీసుకోవాలని, ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, వాహనదారులు, ప్రయాణికులు, మిన్నేకల్లు గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

అవినీతిపై ఫిర్యాదు చేశారని..

మహిళను చితకబాదిన వాలంటీర్

ప్రజాశక్తి-సంతమాగులూరు

బాపట్ల జిల్లాలో స్పందన కార్యక్రమంలో తన అవినీతిపై ఫిర్యాదు చేశారనే నెపంతో, అధికారుల విచారణ సమక్షంలోనే బాధిత మహిళను వాలంటీర్, వాలంటీర్ కుటుంబ సభ్యులు చితకబాదిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రేషన్ కార్డు, ఆధార్ కార్డు కావాలన్నా ప్రతిదానికి మూడు వేల రూపాయల నుంచి ఐదువేల రూపాయల వరకు వాలంటీర్ లంచం డిమాండ్ చేస్తుండటంతో, మండలంలోని కొప్పరం గ్రామ పంచాయతీలోని నెహ్రూ నగర్ కాలనీ మహిళలు తలపల రమణ, గరికా తులసి, తిరువీధుల శివపార్వతి, మేకల పోలయ్య అనే వ్యక్తులు విసుగు చెంది ఈనెల రెండో తేదీన బాపట్లలోని స్పందనలో వాలంటీర్‌పై ఫిర్యాదు చేశారు. మహిళల ఫిర్యాదు మేరకు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, వాలంటీరుపై విచారణ జరిపి, అవినీతి రుజువైతే వెంటనే సస్పెండ్ చేయాలని ఎంపీడీవో ఎం సాంబశివరావుకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ బుధవారం ఎంపీడీవో, గ్రామ కార్యదర్శి విచారణ జరుగుతుండగా, గ్రామ వాలంటీర్ మేకల గోపి, అతని కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఫిర్యాదుదారు తలపల రమణపై దాడి చేశారు. నిందితుడు వాలంటీర్ మేకల గోపిని, అతని కుటుంబ సభ్యులను కఠినంగా శిక్షించాలని బాధిత మహిళ తలపల రమణ శనివారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

వాలంటీర్ సస్పెన్షన్

అవినీతికి పాల్పడిన నెహ్రూ నగర్ కాలనీ గ్రామ వాలంటీర్ మేకల గోపిని సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో ఎం సాంబశివరావు తెలిపారు.



చిన్నారిని పరీక్షిస్తున్న పెట్లూరు పిహెచ్‌సి వైద్యులు పి అనూష

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కొండపి: ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని పెట్లూరు పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ అనూష తెలిపారు. శనివారం నాడు కొండపి మండలం లోని కట్టావారిపాలెం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరంలో 65 మంది రోగులను పరీక్షించి వారి కావాల్సిన మందులను అంద జేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనూష మాట్లాడుతూ బిపి, షుగర్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, వారానికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని తెలిపారు. అనంతరం గ్రామంలోని బాలింతలు, వృద్ధులకు ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం స్వప్న, కాంతారావు, పెట్లూరు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు పాఠశాలలోనే ఉండాలి

ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో బాపట్ల డిఇఒ పివిజె రామారావు

ప్రజాశక్తి-పర్చూరు

బడి ఈడు కలిగిన పిల్లలు పాఠశాలలో కాకుండా బయట ఉంటే ప్రధానోపాధ్యాయులే బాధ్యత వహించాల్సి వస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు స్పష్టం చేశారు. పర్చూరు డివిజన్ పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు పర్చూరు వైజర్ హైస్కూలులో శనివారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం జరిగింది. సమావేశానికి ఉప విద్యాశాఖాధికారి ఎ కిరణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రతి ఒక్కరూ చదువుకోవాల్సిందేనని చెప్పారు. ఒక వేళ విద్యార్థులు ఎవరైనా టిసి తీసుకుంటే వారు ఎక్కడ చేరారు లేదా బడి మానివేశారా అనే విషయాన్ని ప్రధానోపాధ్యాయులు స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. నాడు-నేడు పనుల పురోగతిపై ప్రతిరోజూ వివరాలు అందజేయాలని



సభలో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి రామారావు

ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లాకు మంచి పేరు తెచ్చే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఇందుకోసం 52 రోజుల ప్రణాళికను ప్రతి పాఠశాలలో అమలు చేయాలని కోరారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 27 నుంచి జరుగుతుందని, మండల స్థాయిలో గెలుపొందిన వారిని సంసిద్ధులను చేయాలన్నారు. వైజ్ఞానిక ప్రదర్శనలు ఆలోచింపచేసేవిగా సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండే విధంగా ఉండాలని సూచించారు. విద్యా కానుక నూరు శాతం పంపిణీ చేయాలని, అలా చేయకుండా ఉంటే ప్రధానోపాధ్యాయులు బాధ్యులవుతారని అన్నారు. 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసిన ట్యాబులు విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఉపయోగపడేలా చూడాలని సూచించారు. జాతీయ ప్రతిభ ఉపకార వేతనాలకు జిల్లా నుంచి 24 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిని గుర్తించి సంసిద్ధులను చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాడు-నేడు ప్రత్యేకాధికారి సుబ్రహ్మణ్యేశ్వరరావు, డివిజన్ పరిధిలోని 13 మండలాల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



దిచక్రవాహనదారుడికి హెల్మెట్ అందజేస్తున్న ఎస్పీ

హెల్మెట్లను పంపిణీ చేసిన ఎస్పీ

ప్రజాశక్తి-మేదరమెట్ల

బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం మేదరమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులకు హెల్మెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా కోసం కాదు, మీ కుటుంబం కోసం హెల్మెట్లను ధరించండి మీ ప్రాణాలను మీరే కాపాడుకోండి, అనే నినాదంతో హెల్మెట్ల వల్ల కలిగే ఉపయోగాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి, కొరిసపాడు, మేదరమెట్ల ఎస్ఐలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నిజాంపట్నం

యుటిఎఫ్ నిజాంపట్నం మండల కార్యవర్గ ఎన్నిక శనివారం నిజాంపట్నం యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాపట్ల జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్, ఆర్థిక కార్యదర్శి ఎం వెంకటేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలంలో ఉద్యమాలకు ఉపాధ్యాయులు సంసిద్ధులు కావాలని అన్నారు. ఎన్నికల అధికారిగా జి శాంతారావు, జిల్లా కార్యదర్శులు ఎంపిబి సుబ్రహ్మణ్యం, ఎం వెంకయ్య హాజరయ్యారు. మండల అధ్యక్షులు సిహెచ్ బాపయ్య కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలో యుటిఎఫ్ మండల అధ్యక్షులుగా డి హరిబాబు, ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ గణేష్‌రావు, గౌరవాధ్యక్షులుగా వై శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా షేక్ అబుల్ మాలిక్, లావణ్య, కోశాధికారిగా కె రాజేష్, సిపిఎస్ కన్వీనర్‌గా ఓ నాగరాజు, మహిళా కార్యదర్శిగా ఎన్ పాప, జిల్లా కౌన్సిలర్లుగా బివి రమణ, పి రామకృష్ణ, డి సహదేవరావు, నాగ బసవయ్య, ఏడుకొండలు, మాణిక్యరావు, పార్వతమ్మ, ఎం రాము, మండల కార్యదర్శి కెవి శ్రీనివాస్, ఎండి హుస్సేన్, పి సుబ్బారావు, పి మధుబాబు, ఎం లక్ష్మణరావు, ఎస్తేరురాణి, కె చంద్రయ్య, రహంతుల్లా, ఆల్హా హుస్సేన్, వై సాయిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీకి జిల్లా శాఖ అభినందనలు తెలిపింది.



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

సమోసా, టీతోనే సరి

సమస్యలపై చర్చ లేకుండానే ముగిసిన మండల సమావేశం

ప్రజాశక్తి-మేదరమెట్ల

మేదరమెట్ల మండల సర్వసభ్య సమావేశం సమోసా, టీతోనే ముగిసిపోయింది. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఈ సమావేశం ఎటువంటి ప్రాధాన్యత లేకుండా ముగిసింది. 14 మంది ఎంపిటిసి సభ్యులకు గాను ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. అదేవిధంగా 15 మంది సర్పంచులకు గాను నలుగురు మాత్రమే హాజరయ్యారు. దీనిని బట్టి ఈ సర్వసభ్య సమావేశం ఎంత ప్రాధాన్యతను సంతరించుకుందో ఆలోచన చేయవచ్చు. హాజరైన ప్రజాప్రతినిధులు ఏ ఒక్కరూ తమ తమ గ్రామాలలో ఉన్న సమస్యలపై ప్రస్తావన తీసుకురాలేదు. సంబంధిత అధికారులు వారి విధులను వారు నిర్వహించినట్లు సమావేశానికి తెలియపరిచారు. ఆర్అండ్‌బి, నీటిపారుదల, సాంఘిక సంక్షేమ శాఖ వంటి ఉన్నతమైన శాఖల నుంచి ఎవరూ హాజరు కాకపోవటం గమనార్హం. కారణాలు ఏమైనా ఎంపిడిఓ, తహశీల్దారు సమావేశానికి గైర్హాజరవటం కూడా విమర్శలకు తావిచ్చింది. ప్రతిసారి లాగానే తూతూమంత్రంగా సమోసా, టీ మంచినీళ్లకు పరిమితమైంది. సమావేశానికి ఎంపిపి సాదినేని ప్రసన్నకుమారి అధ్యక్షత వహించారు. సమావేశానికి ఇన్‌ఛార్జి ఎంపిడిఓ ఎం శ్రీలక్ష్మి, జడ్పిటిసి సభ్యులు టి వెంకటరమణ, కొందరు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల ద్వారా ఆదాయం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: పెరటి కోళ్ల ద్వారా డ్వాక్రా మహిళలు ఆదాయం సమకూర్చుకోవచ్చని వెలుగు ఏపిఎం ఎం కరుణాకర్‌రావు సూచించారు. ఇంకొల్లు మండలానికి మంజూరైన 100 యూనిట్లను డ్వాక్రా సంఘాలకు అందజేశారు. పంపిణీ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బండారు ప్రభాకర్, మండల ఉపాధ్యక్షులు తూమాటి చలమయ్య, కో ఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, ఎంపిటిసి సభ్యులు షేక్ హయేషాబుడే, ఇంకొల్లు సహకార సంఘం డైరెక్టర్ రావి పేరయ్య, విఓఎలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



బీడు భూములు చదును చేస్తున్న లంక గ్రామస్థులు

బీడు భూములను చదును చేసిన పేదలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు(కొల్లూరు)

కొల్లూరు మండలం చింతర్లంక, పెదలంక గ్రామాలకు చెందిన పేదలు శనివారం సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కృష్ణా నదిలో బీడుగా ఉన్న భూములను సాగు చేసుకునేందుకు పిచ్చి కంపను తొలగించారు. వందల సంఖ్యలో సెంటు భూమి లేని పేదలు ఎన్నో ఏళ్లుగా బీడు భూమిని సాగుకు అప్పగించాలని ఉన్నతాధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవటంతో స్వచ్ఛందంగా సాగు చేసుకోనేందుకు సిద్ధపడ్డారని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి కృష్ణమోహన్, తోడేటి సురేష్ తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఖాళీగా ఉన్న నదీ పరివాహక ప్రాంతాన్ని సర్వే చేసి పేదలకు భూహక్కు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి సుబ్బారావు, లాజర్, సంసోను, ఇస్మాయిల్ పాల్గొన్నారు.



ఇంకొల్లులో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ప్రజాశక్తి 2023 క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ప్రజాసమస్యలను ముందుకు తీసుకు వెళ్లటంలో ప్రజాశక్తి కీలక పాత్ర పోషిస్తుందని వైసిపి మండల కన్వీనర్ బండారు ప్రభాకర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి టి చలమయ్య, ఎంపిటిసి సభ్యులు షేక్ హయేషాబుడే, ఇంకొల్లు పిఎసిఎస్ డైరెక్టర్ రావి పేరయ్య, ఏపిఎం ఎం కరుణాకర్, కోఆప్షన్ సభ్యులు షేక్ సుభాని, షేక్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఈక్రాప్ బుకింగ్ డేటా పరిశీలన

ప్రజాశక్తి-వేటపాలెం: జనవరి 15వ తేదీ లోపల ఈక్రాప్ బుకింగ్‌ను పూర్తి చేసేందుకు కృషి చేయాలని మండల వ్యవసాయాధికారి ఐ కాశీవిశ్వనాథం అన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపేట రెవెన్యూ డివిజన్ ఆర్‌బికె-3లో ఈక్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. మండలంలో 3,211 ఎకరాలకు 1500, ఎకరాలు ఈక్రాప్‌లో నమోదైందన్నారు. మిగతా పంటను విఎఎ, విఆర్ఓలు, సర్వేయర్స్ ఉమ్మడిగా ప్రతి పంట పొలాలను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని నమూనాలను శుభ్రం చేసుకొని తేమ శాతాన్ని ఆర్‌బికేల్లో పరిశీలించుకోవాలన్నారు. విఆర్ఓలు ఎన్ నాగరాజు, జి. నెహేమియా, ఎం సత్యం, ఎం గోపికృష్ణ పాల్గొన్నారు.

జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని ఆందోళన

ప్రజాశక్తి-కనిగిరి

ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెం 1ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం కనిగిరి పట్టణంలో నిరసన ర్యాలీ, పామూరు బస్టాండ్ సెంటర్‌లో ధర్నా చేపట్టారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి కేశవరావు మాట్లాడుతూ పిఆర్, ఆర్అండ్‌బి, మున్సిపల్ రోడ్లపై నిరసన, సభలు, ర్యాలీలు నిర్వహించకుండా జీవో నెం 1ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకురావటం దుర్మార్గమన్నారు. నాడు ఉద్యమాలను అణిచివేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను నేడు వైసిపి ప్రభుత్వం తీసురావటం దుర్మార్గమన్నారు. ప్రజా ఉద్యమాలకు నష్టం జరిగేలా, ప్రభుత్వ వైఫల్యాలను, తప్పులను ప్రశ్నించి నిలదీయకుండా ఉండేందుకు ఈ జీవోను తీసుకురావటం సరికాదన్నారు. తక్షణమే ఈజీవోను ఉపసంహరించుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు ఎస్‌కె బషీరా, యు పిచ్చయ్య, ఎస్‌కె ఖాశింవలి,



కనిగిరిలో ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న పిసి కేశవరావు



శింగరాయకొండలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎస్‌కె ఖాదర్‌వలి, రవణమ్మ, ఏడుకొండలు, రవి, నరేంద్ర, ప్రసాద్, వేణు, సుబ్బులు, పద్మ, చెన్నమ్మ పాల్గొన్నారు.

శింగరాయకొండ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని శనివారం నాడు శింగరాయకొండలో వామపక్షాల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించి జీవో కాపీని దగ్ధం చేశారు. కందుకూరు రోడ్డు నుంచి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ జీవో కాపీని దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టంగుటూరి రాము, పేమల బాబూరావు, పడిదపు రవికుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాయబ్ రసూల్, సిపిఐ కొండేపి నియోజకవర్గ కార్యదర్శి కె వీరారెడ్డి, జి బాలకోటయ్య, రైతు కూలి సంఘం జిల్లా అధ్యక్షులు కే నాంచార్లు, సుల్తాన్ బాషా, జై భీమ్ పీపుల్స్ జేఏసీ నాయకులు అంబటి కొండలరావు, అల్లు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మిరప తోటల్లో

జిగురు అట్టలు ఎక్కువగా పెట్టుకోవాలి

ఉద్యాన శాఖ జిల్లా అధికారి గోపీచంద్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మిరప తోటల్లో బులుగు రంగు జిగురు అట్టలు ఎక్కువగా పెట్టుకోవాలని ఉద్యాన శాఖ జిల్లా అధికారి వై.గోపీచంద్ తెలిపారు. యర్రగొండపాలెం ఉద్యాన శాఖ కార్యాలయ పరిధిలోని బోడిరెడ్డిపల్లె గ్రామంలో తోట బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ మిరప పంటలో నల్ల తామర పురుగు ఉధతి ఎక్కువగా ఉందని చెప్పారు. రైతులు పురుగు మందులను ఎక్కువగా వాడడం వల్ల ఖర్చు విపరీతంగా పెరుగుతుందన్నారు. బులుగు రంగు జిగురు అట్టలు ఎక్కువగా పెట్టుకోవాలని సూచించారు. వేప, కానుగ నూనెలను విరివిగా పిచికారి చేసుకోవాలని, వర్టిశీలియం లకాని వంటి జీవ సంబంధమైన మందులను వాడుకొని తామర పురుగు ఉధతిని తగ్గించుకోవాలని సూచించారు. కాయ కుళ్ళు తెగులు యాంత్ర దినోత్సవలు ఎక్కువగా ఆశించి కాయ పాడవుతుందని దాని నివారణకు, ప్రాపికొనజోల్, క్యాబ్రియో టాప్, నాటివో వంటి మందులను మార్చి పిచికారి



రైతులతో మాట్లాడుతున్న గోపీచంద్

చేసుకోవాలని తెలిపారు. అనంతరం పెద్దారవీడు మండలంలోని తోకపల్లి, ఓబులక్కపల్లి, త్రిపురాంతకం మండలంలోని కేశినేనిపల్లి, దూపాడు గ్రామాల పరిధిలో ఉద్యాన శాఖ ద్వారా రాయితీకి దరఖాస్తు చేసుకున్న కూరగాయల పందిర్లు, షేడ్ నెట్ నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారి పి ఆదిరెడ్డి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు వస్రం నాయక్, ప్రేమ్ కుమార్, శేషగిరి, ఓబులక్కపల్లి బోడిరెడ్డిపల్లి గ్రామాల రైతు సోదరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్పన

ఆశా కార్యకర్తకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలివ్వాలని ఆశా కార్యకర్తల జిల్లా కార్యదర్శి (సిఐటియు) పి.కల్పన డిమాండ్ చేశారు. మండలంలోని సిఐటియు కార్యాల యంలో శనివారం ఆశా కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా కల్పన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే అన్ని రాయితీలూ ఆశాలకు అందించాల న్నారు. ఆశా కార్యకర్తలపై జరుగుతున్న రాజకీయ వేధింపులను అడ్డుకోవాలని, జీవో నెంబర్.1ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలోని జిల్లా నాయకురాలు నాగమ్మ, మండల కార్యదర్శి సుశీల, జ్యోతి, గంగమ్మ, ఐద్వా నేత నాగమల్లేశ్వరి, సిఐటియు నేత రాజారామయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ సంక్షేమ పథకాలు: ఎంపిపి

ప్రజాశక్తి-దొనకొండ



మాట్లాడుతున్న ఎంపిపి ఉషామురళి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరాలని ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ఎంపీపీ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో పనిచేస్తున్న వారందరూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, కలిసి పరిష్కరించుకుందామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, ఎంపీడీఓ వి.వసంతరావునాయక్, ఈఓఆర్‌డీ ఎస్.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మురారిపల్లిలో కొత్త పించన్లు పంపిణీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండలంలోని మురారిపల్లి గ్రామ సచివాలయంలో నూతనంగా మంజూరైన వైయస్సార్ పించన్లను శనివారం మిల్లంపల్లి సర్పంచ్ ఏకుల జయమ్మ ద్వారా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ విజయలక్ష్మి, మహిళా పోలీస్ అరుణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అనిల్ కుమార్, వాలంటీర్లు పాల్గొన్నారు.

8, 9 తేదీల్లో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా వికాస కేంద్రంలో ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మార్కాపురం స్పోర్ట్స్ అండ్ యోగ క్లబ్ అధ్యక్షులు బి.వెంకటేశ్వరరెడ్డి, కార్యదర్శి షేక్ అమీర్‌బాషా శనివారం తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.40 వేలు మార్కాపురం శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి, రెండవ బహుమతిగా రూ.30 వేలు, శ్రీ కోడిరామమూర్తి ఆరోగ్య, క్రీడాభివద్ధి సంఘం అధ్యక్షులు పిన్నిక నాగేశ్వరరావు, మూడవ బహుమతిగా రూ.25 వేలు, మాజీ మునిసిపల్ చైర్మన్ వక్కలగడ్డ రాధికామల్లికార్జున్, నాల్గవ బహుమతి రూ.20 వేలు, ప్రముఖ న్యాయవాది భూపని కాశయ్య, బెస్ట్ ప్లేయర్స్ అవార్డుగా రూ.10 వేలు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు దొండపాటి మోహన్‌రెడ్డి అందించనున్నారని తెలిపారు. ఈ పోటీలను ఈ నెల ఎనిమిదో తేదీ ఉదయం 10 గంటలకు మార్కాపురం, గిద్దలూరు శాసనసభ్యులు కుందురు నాగార్జునరెడ్డి, అన్నా వెంకటరాంబాబు, సబ్ కలెక్టర్ సేథు మాధవన్, డిఎస్‌పి డాక్టర్ ఎమ్.కిషోర్‌కుమార్, బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు కలిసి ప్రారంభిస్తారని వారు తెలిపారు. తొమ్మిదో తేదీన రాత్రి విజేతలకు నగదు బహుమతుల ప్రదానం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన వారు 7022838353, 9703244003, 6303441157 సెల్ నెంబర్ల ద్వారా సంప్రదించవచ్చన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్ ఫజలుల్లా

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

ది చీమకుర్తి ఏరియా గ్రానైట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) క్యాలెండర్‌ను మున్సిపల్ కమిషనర్ ఎస్‌కె. ఫజులుల్లా శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు, జిల్లా నాయకులు పూసపాటి వెంకటరావు, వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బి వీరాంజనేయులు, నాయకులు కె. శంకర్, సురేష్, వెంకటేశ్, సర్వాసు, కౌన్సిలర్ చంద్ర పాల్గొన్నారు.

ఆర్‌బికె సిబ్బందికి శిక్షణ

ప్రజాశక్తి గిద్దలూరు రూరల్

గిద్దలూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి ఆధునిక వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, ధ్రువీకరణపై శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.ప్రభాకర్‌రావు, కషి విజ్ఞాన్ కేంద్రం, దర్శి శాస్త్రవేత్త టి.వెంకటేశ్వరరెడ్డి, గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ పాల్గొన్నారు.

నియంత పాలనకు నిదర్శనం

జీవో నెం.1ని రద్దు చేయాలని వామపక్షాల నిరసనలు

ప్రజాశక్తి-మార్కాపురం

రోడ్లపై సభలు, సమావేశాలతో పాటు ప్రదర్శనలు నిషేధించడాన్ని వామపక్షాలు తప్పుపట్టాయి. నియంత పాలనకు ఇది నిదర్శనమని ఆరోపించాయి. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబర్ 1ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, సిపిఐ ఏరియా కార్యదర్శి అందె నాసరయ్యలు మాట్లాడారు. ఇలాంటి జీవోలతో ప్రజల గొంతు నొక్కడమే అన్నారు. వైసిపి-టిడిపిల మధ్య గొడవను భూచిగా చూపించి భారత రాజ్యాంగం కల్పించిన హక్కును రద్దు చేయడం వైసిపి ప్రభుత్వ దుర్మార్గమని పేర్కొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు డికెఎం రఫి, షేక్ నన్నెషా, ఆవులయ్య, పిచ్చయ్య, జి విక్టర్, సిపిఐ నాయకులు షేక్ ఖాశిం, చిత్తారి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: రోడ్లపై ప్రజాప్రదర్శనలు,సమావేశాలు నిషేదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్ 1ని రద్దు చేయాలని కోరుతూ సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శనివారం సాయంత్రం స్థానిక పంగులూరికృష్ణయ్య భవనం సెంటర్ నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమానికి పల్లాపల్లి ఆంజనేయులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, కొల్లూరి వెంకటేశ్వర్లు, టి రామారావు, పి ఓబులరెడ్డి, కొండయ్య, నరసింహారావు, వీరాంజనేయులు, సురేష్, శంకర్, శరవణ్, ఖాదర్‌వలి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: జీవో నెంబర్ ఒకటిని రద్దు చేయాలని సీపీఐ సీనియర్ నాయకులు టిసిహెచ్ చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం



మార్కాపురంలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

యర్రగొండపాలెంలో జీవో నెంబర్ 1 రద్దు చేయాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆద్వర్యంలో నిరసన తెలియజేశారు. జిఓ ప్రతులు దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు కష్ణగౌడ్, గురవయ్య, నక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: జీఓ నెంబర్ ఒకటిని రద్దు చేయాలని వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ముందుగా సీపీఐ కార్యాలయం నుండి బస్టాండ్ సెంటర్ వరకు జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ వద్ద జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాస్, మండల కార్యదర్శి బాణాల రామయ్య, పట్టణ కార్యదర్శి కాసిం, నాగేశ్వరావు, మల్లికార్జున పాల్గొన్నారు.

పామూరు: జీవో నెం.1ను రద్దు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి కె.మాల్యాద్రి డిమాండ్ చేశారు. శనివారం సిపియం, సిపిఐ ఆధ్వర్యంలో సుందరయ్య భవనం సెంటర్ ఈ జిఓను రద్దు చేయాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా జిఒ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపియం నాయకులు గౌస్‌బాష, కె శంకర్, నరసింహులు, శ్రీనివాసులు, సిపిఐ నాయకులు మౌలాలి, ప్రభాకర్, మస్తాన్‌రావు, సుబ్బారావు, మోహన్‌రావు పాల్గొన్నారు.

పొదిలి: జీవో నెం.1ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో పొదిలి చిన్న బస్టాండ్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరసనలో సుబ్బయ్య, వెంకటనరసింహం, కోటేశ్వరరావు, నాగులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జీవో నెం.1 రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బడుగు వెంకటేశ్వర్లు, కత్తి ఏబు, వై రామ్మూర్తి, కొమ్మల చిన్నరామయ్య, పోతురాజు మంగయ్య, గురునాథం, రాములు పాల్గొన్నారు.

మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.1ని రద్దు చేయాలని మద్దిపాడు బస్టాండ్ సెంటర్లో సిపిఎం, సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కాలం సుబ్బారావు, సిపిఐ నాయకులు ఉప్పుటూరి ప్రకాశరావు, సిపిఎం నాయకులు యు వెంకటేశ్వర్లు, కనపర్తి సుబ్బారావు, కాశిం, వెంకట్రామిరెడ్డి సిపిఐ నాయకులు యం.శేషయ్య, పావులూరి అంజయ్య, గోపి పాల్గొన్నారు.



చీమకుర్తిలో నిరసన తెలుపుతున్న నాయకులు



పామూరులో జీవో ప్రతులు దహనం చేస్తున్న దృశ్యం



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ

సమయపాలన పాటించాలి: డిఎల్‌డిఒ

ప్రజాశక్తి-తర్లుపాడు

సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, రోజు మూడు పూటలా బయోమెట్రిక్ వేయాలని డిఎల్‌డిఒ సాయికుమార్ శనివారం తెలిపారు. గత వారం రోజుల్లో రెండు పర్యాయములు తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం సచివాలయాన్ని డిఎల్‌డిఓ తనిఖీ చేశారు. రెండో పర్యాయం శనివారం ఉదయం ఆయన సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అర్జీదారులు స్పందనలో భాగంగా కలెక్టరేట్‌కు వెళ్లకుండా ఇక్కడే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలన్నిటిని సచివాలయంలోనే పరిష్కరించే విధంగా సిబ్బంది పాటుపడాలన్నారు.



ఎస్‌ఐలతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

11న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-దర్శి

ఫిబ్రవరి 11న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని, ఈ సందర్భంగా ఎక్కువ కేసులు పరిష్కరించాలని లోక్ అదాలత్ చైర్మన్ మరియు సీనియర్ సివిల్ జడ్జి జివిఎల్‌వి.ప్రసాద్ అన్నారు. శనివారం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో కోర్టు పరిధిలోని 5 మండలాల ఎస్ఐలతో సమీక్ష నిర్వహించి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి జివిఎల్ సరస్వతి మాట్లాడుతూ ఎక్కువ కేసులు పరిష్కరించాలని సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామక్రిష్ణ, మల్లిఖార్జున్, సైదుబాబు, మోహన్‌రావు పాల్గొన్నారు.

డాక్టర్ బసవయ్యకు సన్మానం

ప్రజాశక్తి-దర్శి

బసవయ్య సేవలను గుర్తించి జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డును కేంద్రమంత్రి సంజీవ్‌కుమార్ బాల్యన్ నుండి తీసుకున్న సందర్భంగా దర్శిలోని పశువైద్యశాల ఏరియా హాస్పిటల్‌లో డాక్టర్ బసవయ్యను పశువైద్యాధికారులతో పాటు ఎఎంసి చైర్మన్ వైవి సుబ్బయ్యలు సన్మానించారు. కార్యక్రమంలో ఎడి డాక్టరు పురుషోత్తమరాజు, వైద్యాధికారులు రాంబాబు, కాశినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

అర్హత ఉన్న ప్రతి అవ్వాతాతలకి కొత్త పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మండల అధ్యక్షురాలు గాయం సావిత్రి అన్నారు. నూతనంగా పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లను గాయం సావిత్రి, ఎంపిటిసి నారాయణస్వామి శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గాయం బలరామిరెడ్డి, వైస్ ఎంపిపి బెంజిమెన్, సింగిల్ విండో చైర్మన్ యక్కంటి శ్రీనివాసరెడ్డి, ఎండిఒ కస్తూరావు, ఎంపిటిసి ఉడుముల సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'ముత్తుముల'కు ఘన స్వాగతం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

గిద్దలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డికి శనివారం బేస్తవారిపేటలో ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. బేస్తవారిపేట ఆర్య వైశ్య నాయకులు బీసు అరుణ్ కుమార్ ఆహ్వానం మేరకు ఇక్కడికివచ్చిన ముత్తుముల అశోక్‌రెడ్డి వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. అశోక్‌రెడ్డిని పూలమాల, శాలువా వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సొరెడ్డి మోహన్ రెడ్డి, ఎంపిటిసి సభ్యులు పూనూరు భూపాల్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దూదేకుల సైదులు పాల్గొన్నారు.

ఉత్సాహభరితంగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-దర్శి

దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మొత్తం 16 టీమ్‌లు పాల్గొన్నాయి. హోరాహోరీగా జరిగిన పోటీలలో ఫైనల్‌లో కృష్ణా జిల్లా జట్టు విజయం సాధించింది. ప్రథమ బహుమతిని జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి సహకారంతో రూ.75 వేలను నిర్వాహకులు విజయం సాధించిన జట్టుకు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అప్పికట్ల చెంగళరాయుడు, గర్నెపూడి స్టీవెన్ పాల్గొన్నారు.



బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మేలు చేసే వారికి సాయపడండి..

మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

రాష్ట్ర ప్రజల బాగోగులు తెలుసుకొని మేలు చేసే వారికి సహాయపడాలని కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మండలంలో కొత్తగా మంజూరైన 230 వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారులకు కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి మోరబోయిన మురళీకృష్ణ, జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు టి.చిన్నవెంకటరెడ్డి, రేగడపల్లి, చిన్నారికట్ల సొసైటీల సింగిల్ విండో అధ్యక్షులు కామసాని వెంకటేశ్వర్‌రెడ్డి, కాశిరెడ్డి, ఇన్‌చార్జి ఎంపిడిఓ శ్రీనివాసులరావు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు భూదాల థామస్ పాల్గొన్నారు.

పెద్దారవీడు: అర్హత ఉన్న ప్రతి అవ్వా, తాతలకు కొత్త పింఛన్లు, సంక్షేమ పథకాలు అందించడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని మండల సర్పంచుల సంఘం ఉపాధ్యక్షులు, సుంకేసుల సర్పంచ్ గుడ్డెపోగు రమేష్ అన్నారు. నూతనంగా పెంచిన వైఎస్సార్ పెన్షన్ కానుక పథకంలో భాగంగా మండలంలోని సుంకేసుల గ్రామంలోని సచివాలయంలో సర్పంచి రమేష్ ద్వారా వైసిపి నాయకులు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ కోర్ర శ్రీను నాయక్, వైస్ సర్పంచి కోటకొండ నాగమణి, కోటేశ్వరరావు, వైసిపి నాయకులు ఆవుల నాగిరెడ్డి, గుడ్డెపోగు వెంకటసుబ్బయ్య, గుర్రం ముత్యాలయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ సానికొమ్ము మల్లారెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి

వెలిగండ్ల: స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో వైఎస్ఆర్ పింఛన్ కానుక నూతన పింఛన్‌లను ఎంపిపి రామన మహాలక్ష్మీ, జడ్‌పిటిసి గుంటక తిరుపతిరెడ్డి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ తాతపూడి సుకుమార్, రామన తిరుపతిరెడ్డి, వైస్ ఎంపిపి వై.భారతి, తాతపూడి మేరి పుష్ప, వైసిపి కన్వీనర్ గజ్జల వెంకటరెడ్డి, కోఆప్షన్ అమీర్, వెలిగండ్ల సర్పంచి తాతపూడి సురేష్‌బాబు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలుచేయాలి

ప్రజాశక్తి-పామూరు

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి.. కనీస వేతనాల చట్టం అమలు చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆటో మెకానిక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) సమావేశం పప్పు యంకోబురావు మీటింగ్ హాల్‌లో షేక్ మస్తాన్ అధ్యక్షతన శనివారం జరిగింది. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా షేక్ మస్తాన్‌వలీ, ఉపాధ్యక్షులుగా హరి, కార్యదర్శిగా పి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా విజయ్, కోశాధికారిగా పఠాన్ సుభాని, రసూల్, శంకర్, షేక్ అల్లాబక్షు ఎన్నికయ్యారు.



ఎన్నికైన నూతన కమిటీ



విఆర్ లా కాలేజ్ పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నంలో నల్లూరి గార్డెన్ లో విఆర్ లా కాలేజ్ నెల్లూరులో 1982-85 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు పిట్టల లక్ష్మయ్య, పంగులూరు గోవిందయ్య మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీపతి శ్రీనివాసరావు, ఎం.గంగాధర్, కె.విశ్వేశ్వరరావు, సిహెచ్. కొండయ్యచౌదరి, ఎం.రమణయ్య, శ్రీను పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి-వెలిగండ్ల



రూ.50 వేలు అందజేస్తున్న నాయకులు

వెలిగండ్ల టిడిపి నాయకులు మోటాటి వెంకటసుబ్బారెడ్డి, దారెడ్డి వెంకట సుబ్బారెడ్డి అన్నా క్యాంటీన్ కోసం రూ.50 వేలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు పేదల ఆకలిని తీర్చేందుకు తలపెట్టిన అన్నా క్యాంటీన్ నిర్వహణకు చేయూతనివ్వాలని ఆయన కోరారు. అన్నా క్యాంటీన్ నిర్వహణకు నగదు అందజేసిన వారిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగురైతు అధ్యక్షులు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మీనిగ కాశయ్య పాల్గొన్నారు.

'చలో కావలి'ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-పెద్దారవీడు

టిడిపి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదిన తలపెట్టిన చలో కావలి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని టిడిపి యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఎస్సీసెల్ అధ్యక్షులు లింగాల అబ్రహం శనివారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళితులపై వైసిపి నాయకుల చేస్తున్న దాడులు, హత్యలు, దమన కాండకు నిరసనగా టిడిపి రాష్ట్ర ఎస్సీసెల్ అధ్యక్షులు ఎంఎస్.రాజు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఎస్సీసెల్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

'పేస్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-టంగుటూరు

మిషన్ లెర్నింగ్ ద్వారా ఆధునిక సాంకేతిక శాస్త్రంపై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని ఐఐటి గోవా కంప్యూటర్ విభాగం ప్రొఫెసర్ ఇ.దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రైన్ కంప్యూటర్ ఫేస్ మిషన్ లెర్నింగ్ అంశంపై పేస్ కళాశాల ఇంజనీరింగ్ విభాగం విద్యార్థులకు డి సురేష్ ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జీవీకే మూర్తి, ఇన్చార్జి హెచ్‌ఒడి ఎస్ గిరిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ షేక్ హీరా కౌశల్, కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని హనుమాన్ జంక్షన్(కుంట)లోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌లో అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎస్‌కె.కరీమా మాట్లాడుతూ అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ లక్ష్మణ్, అనిల్‌కుమార్, క్యాషియర్ కోటి బాబు, బ్యాంక్ సిబ్బంది హరినారాయణ, హర్షవర్ధన్ పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండల కేంద్రమైన సంతనూతలపాడు అంబేద్కర్ నగర్‌కి చెందిన బల్లికురవ శ్రీనివాసరావు(34) గుండెపోటుతో మృతిచెందారు. శనివారం వారి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా కింద మట్టి ఖర్చుల కింద గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి పది వేల నగదును అందజేశారు. మరో 90 వేల రూపాయలు జమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి తన్నీరు రాగమ్మ, సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ పి.శివరాజశేఖర్ ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జైనులాబ్దిన్

మాదాలవారిపాలెంలో 'పొలంబడి'

ప్రజాశక్తి-పొదిలి

మండలంలోని మాదాలవారిపాలెంలో పొలం బడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో ఎస్‌కె జైనులాబ్దిన్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-చీరాల

నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని ఒకటో పట్టణ పోలీసులు చీరాల మార్కెట్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా చీరాల వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావు మాట్లాడుతూ ప్రయాణికులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. మితిమీరిన వేగంతో, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని వాహనదారులు హెల్మెట్ ధరించే వాహనాలు నడపాలని రోడ్డు భద్రత నియమాలు పాటించనివారికి చలానాలు విధిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు ప్లకార్డులు పట్టుకొని వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ సాల్మన్ రాజ్, చీరాల వన్ టౌన్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





చీరాలలో భద్రతపై అవగాహన కల్పిస్తున్న వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావు, ఇంకొల్లులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నాయబ్‌రసూల్

ఇంకొల్లు రూరల్: ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఇంకొల్లు ఎస్ఐ షేక్ నాయబ్ రసూల్ సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాల మేరకు ఇంకొల్లులో శనివారం అవగాహన కల్పించారు. పర్చూరు-ఇంకొల్లు రోడ్డులో వాహనాలను ఆపి హెల్మెట్ ఆవశ్యకతను గురించి వాహన చోదకులకు వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-చీరాల: చీరాల మండలం దేవంగపురి పంచాయతీ పరిధిలో ఇటీవల షాక్ సర్క్యూట్‌తో పృథ్వీ మోహన్ రావు, పృథ్వీ వెంకటేశ్వర్లుకు సంబంధించిన ఇల్లు దగ్ధం ఆయన సంగతి తెలిసిందే. శనివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చీరాల ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు వారిని పరామర్శించి ప్రమాదం జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నష్టపరిహాన్ని తక్షణమే అందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అదేవిధంగా తక్షణ సహాయం కింద ఇరు కుటుంబాలకు చెరొక పదివేల రూపాయలు అందించారు. కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, ధనుంజయ్, అంకాలరెడ్డి, లేళ్ల శ్రీధర్, దంతం హనుమంతరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



బాధితులను పరామర్శిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు

జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కొండపి: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ కొండపి మండలంలోని దాసిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం నుంచి ప్రారంభించినట్లు దాసరెడ్డిపాలెం యూత్ ఫోర్స్ నిర్వహకులు వంశీకృష్ణ, ఖాజావలి తెలిపారు. ఈ క్రికెట్ పోటీలు కొండపిలోని పొదిలిరోడ్డులో చాణిక్య జూనియర్ కాలేజి వెనుక గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారికి ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.25,116, రెండో బహుమతి రూ.15,116, మూడో బహుమతి రూ.7,116 ఇస్తామన్నారు. ఎంట్రీ ఫీజు రూ.600 ఉంటుందని, ప్రతి మ్యాచ్ నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు షీల్డ్ ఉందన్నారు. ఎవరి కిట్టు వారే తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఒక టీమ్‌లో ఆడిన వ్యక్తి ఇంకొక్క టీమ్‌లో ఆడరాదని అన్నారు. బాలు కమిటీ వారి వద్ద కొనాలని పేర్కొన్నారు. తుది నిర్ణయం కమిటీ వారిదే అని తెలిపారు. వివరాలకు వంశీకృష్ణ 9912692992, ఖాజావలి 9398534526 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



వెల్లటూరు వాసవీ క్లబ్ నూతన పాలకవర్గం

వెల్లటూరు వాసవీ క్లబ్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరు వాసవి క్లబ్ నూతన పాలకవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. క్లబ్ అధ్యక్షులుగా నాగళ్ల ఆంజనేయులు, కార్యదర్శిగా నంబూరు పవనకుమార్, కోశాధికారిగా నంబూరు ప్రసాద్ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా గవర్నర్ గోనుగుంట్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గత పాలకవర్గం చేసిన సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు నంబురు తేజ కుమార్, తునుగుంట్ల శ్రీధర్, నంబూరు నాగభూషణం, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపు 13కు వాయిదా

ప్రజాశక్తి-పంగులూరు

గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో, ప్రతి రెండు నెలలకు ఒకసారి జరిగే మెడికల్ క్యాంపు ఈనెల 13వ తేదీన జరగనున్నట్లు వేదిక కన్వీనర్ కే బాలచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగరు, బిపి మొదలైన వాటికి ఇంకొల్లు మండలం, గంగవరం గ్రామంలోని గంగవరం ఆరోగ్య సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో, ప్రతి రెండు నెలలకు ఒకసారి మెడికల్ క్యాంపు నిర్వహించి మందులు ఇస్తున్నామని, ఈ నెల 8వ తేదీన ఆదివారం నాడు క్యాంపు జరగాల్సి ఉండగా, కొన్ని కారణాలు రీత్యా 13వ తేదీకి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. క్యాంపునకు వచ్చేవారు షుగర్, బీపీ మొదలైన వాటికి బయటనే పరీక్షలు చేయించుకొని రిపోర్టులు తీసుకొని రావాలని, రెండు నెలలకు మందులు ఇస్తామని, అందుకుగాను 200 రూపాయలు తీసుకురావాలని ఆయన కోరారు.



రెండో రోజు నిరాహార దీక్షలో పాల్గొన్న పేదలు

కొనసాగుతున్న రిలే దీక్షలు

ప్రజాశక్తి-బల్లికురవ

పెత్తందారుల ఆధీనంలో ఉన్న అసైన్మెంట్ భూములను లబ్ధిదారులుగా ఉన్న దళితులకు అప్పగించాలనే డిమాండ్‌తో ప్రారంభం అయిన కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల పేదల రిలే నిరాహార దీక్షలు శనివారం రెండో రోజు కొనసాగాయి. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న ఈ దీక్షల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ భూ సమస్య పరిష్కారం కోసం గత కొన్ని నెలల నుంచి, మండల, జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని అన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని అన్నారు. ఇప్పటికే అధికారులు భూముల రీ సర్వే పేరుతో లబ్ధిదారులుగా పెత్తందారుల పేర్లు నమోదు చేసుకున్నారని, ఇది ఏమాత్రం సరి కాదని, వెంటనే సంబంధిత ఆక్రమితదారులకు నోటీసులు అందించి పేదలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గొల్లపూడి అంజయ్య, అధ్యక్షులు బి వీరయ్య, భూ పోరాట సాధన కమిటీ కన్వీనర్ ముట్లూరు లాబాను, తంగిరాల రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి రాని పిఎసిఎస్ సిబ్బంది

రుణాల కోసం వచ్చి వెనుదిరిగిన రైతులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

చెరుకుపల్లి మండల పరిధిలోని గూడవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు షంషుద్దీన్ శనివారం కార్యాలయానికి వచ్చినప్పటికీ ఉదయం 11 గంటలయినా కార్యాలయం తలుపులు తీయకపోవడంతో బయటే నిలబడాల్సి వచ్చింది. తాను రుణాలు ఇప్పించడానికి తీసుకువచ్చిన రైతులతో సహా బయట నిలబడి, ఫోన్లు చేసినా జవాబు లేకపోవడంతో వెనుదిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయంపై సొసైటీ చైర్ పర్సన్ షంషుద్దీన్ మాట్లాడుతూ శుక్రవారం ఫోన్ చేసి రుణాలు మంజూరు కోసం శనివారం కార్యాలయానికి వస్తానని, రైతులను తీసుకొని వస్తానని చెప్పినప్పటికీ సిబ్బంది కార్యాలయానికి రాలేదని, ఫోన్ చేసినప్పటికీ సొసైటీ సీఈఓ కొండేటి యబ్బేజు జవాబు చెప్పలేదని చైర్ పర్సన్ తెలిపారు. చేసేదిలేక రుణాల కోసం వచ్చిన రైతులు వెను దిరిగారని తెలిపారు.



బయట నిలబడిన గూడవల్లి పిఎసిఎస్ చైర్ పర్సన్ మహమ్మద్ షంషుద్దీన్, రుణాల కోసం వచ్చిన రైతులు



కోళ్లు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెరటి కోళ్లు పంపిణీ

ప్రజాశక్తి-కారంచేడు

మండలంలోని వెలుగు కార్యాలయంలో శనివారం నాడు పెరటి కోళ్ల పంపిణీ జరిగింది. మొత్తం 100 యూనిట్ల పెరటి కోళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. వీటిలో ఒక్కొక్క యూనిట్ ధర రూ.4,800 రూపాయలు. కాగా ఒక్కొక్కరికి 9 పెట్ట కోళ్లు, 3 పుంజు కోళ్లు ఒక ఒక యూనిట్ కింద వస్తాయని అధికారులు చెప్పారు. దీనితో పాటు ఒక మెడికల్ కిట్ 30 కేజీల దాణా కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారంచేడు జడ్పిటిసి యార్లగడ్డ రజిని శ్రీనివాస్, ఎంపీడీవో ఆర్ రమేష్ బాబు, వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మండల వైసిపి కన్వీనర్ దండా చౌదరి బాబు, ఏపీఎం మధుసూదనరావు, సీసీలు, వీవోఏలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



గడప గడపకూలో పాల్గొన్న కోన రఘుపతి

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: కోన

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల మండలం అడవి-1 పాండురంగాపురం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. గ్రామ సచివాలయం సిబ్బందితో, వాలంటీర్లతో, ప్రతి గడపకూ వెళ్లి ఈ 3 సంవత్సరాలలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న సంస్థ చైర్మన్ దేవానంద్

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పేర్కొన్నారు. శనివారం బాపట్ల శాఖా గ్రంథాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, రీడర్స్ కోరిన పుస్తకాలను ఆన్ డిమాండ్ ద్వారా తెప్పించిన పుస్తకాలను స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసినవి పరిశీలించారు. అనంతరం పాఠకులకు కావలసిన ఏర్పాట్ల గురించి తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం దాతలు బహూకరించిన కుర్చీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే దాతల సహాయ సహకారాలతో గ్రంథాలయ అభివృద్ధికి తీసుకోవలసిన చర్యల గురించి గ్రంథాలయ అధికారికి తగిన సలహాలు చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి పాటుపడుతున్న గ్రంథాలయ సిబ్బందిని అభినందించారు.

లోపభూయిష్టంగా శాశ్వత భూహక్కు పథకం

- ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుందూరి రంగారావు
- తప్పుల తడకగా జగనన్న భూ హక్కు పత్రాలు
- ఎడిట్ ఆప్షన్‌ను బయటపెట్టాలని డిమాండ్



మాట్లాడుతున్న చుందూరి రంగారావు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం లోపభూయిష్టంగా ఉందని ప్రకాశం జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షులు చుందూరి రంగారావు పేర్కొన్నారు. ఒంగోలు ప్రెస్ క్లబ్ లో శనివారం పాత్రికేయుల సమావేశంలో చుండూరి రంగారావు మాట్లాడుతూ జగనన్న భుహక్కు పత్రాలు తప్పులుతడకగా ఉన్నాయని, మద్దిపాడు, టంగుటూరు మండలాలలో ఇచ్చిన జగనన్న భూ హక్కు పత్రాలను పరిశీలిస్తే తేటతెల్లమవుతుందన్నారు. తప్పులను సరిదిద్దుకుని ఎడిట్ ఆప్షన్ ను ప్రభుత్వం ఇప్పటివరకు బహిర్గతం చేయలేదన్నారు. కొన్ని ప్రాంతాల్లో 40%, మరికొన్ని ప్రాంతాల్లో 60 శాతం, మరికొన్ని ప్రాంతాల్లో 70% తప్పులు దొర్లిన జగనన్న భూ హక్కు పత్రాలు సరి చేసుకోవడం రైతులకు మరింత జటిలమవుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సర్వే పూర్తయినట్లుగా చెప్పున్న 1845 గ్రామాలలోని సుమారు 8 లక్షల మంది భూ యజమానులకు ముఖ్య మంత్రి జగన్ ఫోటోలతో భూహక్కు పత్రాలు 2022 నవంబర్ 23 నుంచి ఇవ్వడం ప్రారంభించారన్నారు. కొత్తగా ఇచ్చే పాస్ పుస్తకాలలో పట్టాదారు పేరు, భర్త లేక తండ్రి పేరు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, ఏ విధంగా భూమి సంక్రమించినది, ఏ ఉత్తర్వుల దాఖలా వివరాలతో భూ యజమాని ఫోటోతో, ఎల్ పి నంబర్, పాత సర్వే సబ్ డివిజన్ నెంబర్, ఎల్ పి నెంబర్ విస్తీర్ణం, మెట్ట లేక మాగాణి వంటి వివరాలతో పాస్ పుస్తకం రూపొందించాలన్నారు. అనేక గ్రామా లలో ప్రచురించిన ఆర్ ఓ ఆర్ లు, డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్లు పరిశీలించిన తరువాత అనేక అంశాలు వెలుగులోకి వచ్చాయన్నారు. పాత సర్వే నెంబర్ లో సబ్ డివిజన్ కు చెందిన విస్తీర్ణాన్ని నమోదు చేయకపోవటంతో ఏ రైతుకు ఏ సర్వే నెంబర్‌లో ఎంత భూమి ఉందనే విషయం తెలిసే అవకాశం లేకుండా పోయిందన్నారు. రైతుల పాత దస్తావేజులలోనూ, పాత 1బి లలో, పాత సర్వే నెంబర్లు ఉదహరించి షెడ్యూల్లో ఆస్తి వివరాలు, సర్వే నంబర్లు వారి విస్తీర్ణం, నాలుగు వైపులా ఉన్న సరిహద్దులలోని రైతుల వివరాలను నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఆస్తుల హక్కుల బదలాయింపు విషయంలో, లీజు, తనఖా, లీగల్ ఒపీనియన్ల ద్వారా పొందే సందర్భాలలో లింక్ డాక్యుమెంట్లు తప్పనిసరి అని పేర్కొన్నారు. సర్వే నెంబర్, సబ్ డివిజన్‌లో వారి విస్తీర్ణం నమోదు చేయకుండా ఉంటే వివాదాలకు ఆస్కారం ఉంటుందన్నారు. ఒక ల్యాండ్ పార్శిల్ లో ఒకరికి మించి భూ యజమానులు ఉంటే ఏ సర్వే నెంబర్లు ఏ వైపున ఏ రైతు ఉన్నారో, పాత హద్దులలో మార్పులు లేకుండా కొత్త ఎల్‌పిలో ఎలా చూపిస్తారని ప్రశ్నించారు. పట్టాదారు పాసుపుస్తకం చేతికి వచ్చే వరకు ఎవరి పేరు ఎంత భూమి ఉందనే విషయం తెలియటం లేదన్నారు ఎస్‌ఓపిలో రూపొందించిన విధానం ప్రకారం భూమి రికార్డుల స్వచ్ఛీకరణ మొదలుకొని పాస్ పుస్తకాలు రైతు లకు ఇచ్చేవరకు అనేక ఫారంలు పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. ప్రతి ఫారంలో పది నుండి 31 వరకు కాలమ్స్ ఉంటాయన్నారు. రైతులకు నాలుగు సార్లు నోటీసులు ఇవ్వాలన్నారు. వివాదాలు ఉంటే ఇరువురికి నోటీసులు ఇవ్వాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన జరగాలని, గ్రామ సభలు నిర్వహించాలని, కౌంటర్ చెక్ చేసే విష యంలో అధికారులు సహకరించవలసి ఉంటుం దన్నారు. ప్రభుత్వం కలెక్టర్లపై వారు చిరు ఉద్యోగుల మీద ఒత్తిడి తీసుకురావడంతో అనేక లోపాలు జరుగుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు చిత్తశుద్ధితో జగనన్న భూహక్కు పత్రాన్ని ఎటువంటి తప్పులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆచార్య రంగా కిసాన్ సంస్థ ప్రధాన కార్యదర్శి చుంచు శేషయ్య మాట్లాడుతూ భూముల రీ సర్వే ప్రతి 30 సంవత్సరాలకు ఒకసారి జరగాలని, గత 100 సంవత్సరాలుగా రీ సర్వేలు జరగలేదన్నారు. రీ సర్వే చేపట్టాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో రైతుల అంగీకారంతో పూర్తిస్థాయిలో విచారణ జరిపి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వవలసి ఉందన్నారు. అందుకు విరుద్ధంగా పట్టాదారు పాస్ పుస్తకాలన్నీ తప్పులతడకగా వచ్చాయని, దీంతో రైతులు నానా ఇబ్బందులు పడవలసి ఉంటుందన్నారు. ఒకే పాస్ పుస్తకంలో 10 నుండి 15 మంది వరకు లబ్ధిదారుల పేర్లు ఉండటంతో భవిష్యత్తులో రైతులు తమ భూమిని అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్న నానా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడతాయన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి పరిశీలన చేసి పాత రికార్డులను పరిశీలించి రైతుల అంగీకారంతో పట్టాదారు పాస్ పుస్తకాలను పూర్తి వివరాలు పూర్తిచేసి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా భూ రీ సర్వే లో క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి తగిన పరిష్కారాలు చూపుతూ జగనన్న భూహక్కు పత్రాలను ఎటువంటి తప్పులు లేకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత కుమారి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రణాళికాబద్ధ కృషితో లక్ష్యసాధన

విద్యార్థులకు కలెక్టర్ దినేష్‌కుమార్ దిశానిర్దేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రణాళికాబద్ధ కృషితోనే లక్ష్యాన్ని చేరుకోగలమని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఈ దిశగా ఇప్పటి నుంచే దష్టి పెట్టాలని ఆయన సూచించారు. ప్రతి శనివారం నిర్వహిస్తున్న 'కాఫీ విత్ కలెక్టర్ ' కార్యక్రమంలో భాగంగా ఒంగోలు ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన ముచ్చటించారు.వారి అభిరుచులు, ఆశయాలు, కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు.నీ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చిన్ననాటి నుంచే సమాజంపై అవగాహన పెంచుకోవాలని, లక్ష్య సాధనకు పేదరికాన్ని అడ్డుగా భావించవద్దన్నారు. ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి నిరంతర కృషి అవసరమని వారికి వివరించారు. ఈ విషయాలలో అవగాహన కల్పించడానికే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ క్లాసులను ప్రవేశ పెట్టామన్నారు. స్పష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని, ఈ దిశగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులలో స్ఫూర్తిని నింపేలా ఆయన సంతకం చేసిన పుస్తకాలను వారికి అందించారు. కార్యక్రమంలో ఆర్‌ఐఒ సైమన్ విక్టర్, ప్రిన్సిపాల్ ఆర్.వెంకటరావు, ఇంగ్లీష్ లెక్చరర్, కెరీర్ గైడెన్స్ కో-ఆర్డినేటర్ సురేష్, సివిక్స్ లెక్చరర్ పి. మాధవరావు, ఫిజిక్స్ లెక్చరర్ మాధవీ లక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్ డేవిడ్ రాజు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలను

వేగవంతం చేయాలి

బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద ప్రజలకు గృహ నిర్మాణాన్ని అందజేస్తుందని జగనన్న గృహాలను ఆయా కాంట్రాక్టర్లు త్వరగా పూర్తి చేయాలని ఆదిశగా అదికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని వాడరేవు బోయినవారిపాలెం చీరాల నగర్ టు జగనన్న కాలనీ లేఔట్లను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతంగా నిర్మించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. గృహ నిర్మాణాలలో లక్ష్యాలను సాధించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.కాంట్రాక్టర్లను గృహనిర్మాణ లబ్ధిదారులను సమన్వయం చేస్తూ గృహాలను వేగవంతంగా నిర్మించాలని సూచనలు చేశారు.గృహ నిర్మాణాలకు సంబంధించి అన్ని వసతులను లబ్ధిదారులకు కల్పించాలని అన్నారు.రోడ్లు ఇసుక సిమెంటు నీటి కొరత వంటివి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ఆమె వెంట చీరాల వేటపాలెం తాసిల్దారులు ప్రభాకర్, ఎంపీడీవో నేతాజీ, హౌసింగ్ డిఈ,ఏఈ, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

పండుగల్లో కోవిడ్‌పై అశ్రద్ధ వద్దు: డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాబోయే పండుగ రోజులలో ప్రజలందరూ కోవిడ్‌ను అశ్రద్ధ చెయ్యొద్దని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి సూచించారు. పండుగ రోజులలో షాపింగ్‌మాల్స్ , సినిమా హాల్స్‌లో, బహిరంగ ప్రదేశాలలో జన సంచారము ఎక్కువగా ఉంటుందని, కోవిడ్ ప్రోటోకాల్‌ను పాటించాలని సూచించారు. ముందు జాగ్రత్తగా ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని, శుభ్రంగా చేతులు ఉంచుకోవాలన్నారు. వివిధ ప్రదేశాలకు వెళ్లే ప్రజలు, ఉద్యోగులు బస్సులు, రైళ్లల్లో తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. కోవిడ్ 2వ మోతాదు, బూస్టర్ డోస్‌ను వెంటనే వేసుకోవాలన్నారు.

అంతా నిషేధమే.?

ప్రజావ్యతిరేక పెల్లుబికే సమయాన వాటిని అణచేందుకు కఠిన జీఓలు తేవడం పాలకులకు సహజమే.ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏమీ చేయకూడాదనే సిద్ధాంతమే ఇందులో దాగిఉంటుంది.పైకి మాత్రం ప్రజలకోసమే..వారి రక్షణ కోసమే అన్నట్లుగా శాంతిభద్రతల పేరుతో చీకటిజీఓలు తేవడం ఎప్పటినుంచో చూస్తున్నాం.గతంలో నిషేధిత గ్రూపులపై ప్రయోగించే చీకటి జీఓలను ఇపుడు ప్రజలకోసం పోరాటాలు చేసే పార్టీలపైనా మోపుతున్నారు.ఇందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తెచ్చిన జీఓనెం.1.దీనిపై సర్వత్రా విమర్శలు తీవ్రమవుతున్నాయి. అన్ని ప్రతిపక్షపార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి.రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేదం పేరుతో తెచ్చిన ఈ జీఓ ఆచరణలోకి వచ్చే సరికి ప్రతిపక్ష పార్టీలు ఏమీచేయడానికి వీల్లేదనే కోణంలో చర్యలు కనిపిస్తున్నాయి. కందుకూరు ఘటన నేపద్యంలో తెచ్చిన ఈ జీఓ ఉద్దేశం ఏమిటో ఈపాటికే ప్రజలకు బోధపడింది. ప్రతిపక్ష నేత చంద్రబాబును సొంత నియోజక వర్గంలోనే పర్యటించకుండా అడ్డుకోవడంతో ఆ పార్టీ వర్గాలు ఇపుడు భగ్గుమంటున్నాయి. ఇదే తీరున తాము వ్యవహరిస్తే ఆనాడు పాదయాత్ర జరిగేదా?అని సిఎం జగన్‌ను ప్రశ్నిస్తున్నారు. రానున్న కాలంలో ఎన్నికలు ముందున్నాయి. ఇప్పటికే ఎన్నికల వాతావరణం వచ్చింది.ఈ తరుణంలో ఇలాంటి జీఓలు రాజకీయ ఉద్దేశాలతోనే వచ్చాయనే చర్చ సాగుతోంది.రోడ్లపైనే నిషేధం పేరుతో తెచ్చిన ఈజీఓ చివరికి ఇతర కార్యక్రమాలపైనా ప్రభావం చూపుతోంది. ఏదేమైనా గతంలో ప్రజాఉద్యమాలను అణచేందుకు రకరకాల చట్టాలు తెచ్చారు.ఇపుడు రాజకీయంగా ప్రతిపక్షాలను అణచేందుకు జీఓ నెం.1 తెచ్చినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.దీన్ని అడ్డుపెట్టుకుని పోలీసులు వ్యవహరించే తీరు పార్టీల నడుమ మరింత ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసే ప్రమాదం లేకపోలేదు.ఇలాంటి చీకటి జీఓలను రద్దుచేయడమే సమంజసమనే చర్చ ప్రజాస్వామ్యవాదుల్లో సాగుతోంది.



రాజకీయ హైడ్రామా నడుమ బాలకృష్ణ నటించిన వీరసింహారెడ్డి ప్రీరిలీజ్ వేడుక ముగిసింది. అనుమతుల పేరుతో ఆ చిత్ర బృందాన్ని నానా అవస్థలకు గురిచేశారు పోలీసులు. ఎబిఎంగ్రౌండులో అనుమతిచ్చారు.అన్ని ఏర్పాట్లు చేస్తున్న సమయంలో హఠాత్తుగా అనుమతి రద్దుచేశారు.ఊరిబయటకు తరలించాలని ఆదేశాలు ఇచ్చారు. ఒక రోజు ముందు త్రోవగుంట సమీపంలోని ఓ విల్లా నిర్మించే స్థలంలో ఏర్పాటు చేశారు.అనుమతుల పేరుతో అక్కడకు అభిమానులను రాకుండా అడ్డుకునేయత్నం జరిగిందనే చర్చ తెలుగుదేశంలో ఉంది.ఎబిఎం గ్రౌండులో అనుమతి నిరాకరణపై మాజీ ఎమ్మెల్యే దామచర్ల కూడా పాలకపక్ష నేతపై విమర్శలు చేశారు.బాలకృష్ణ సీనియర్ హీరోనేకాకుండా తెలుగుదేశం ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు.దీన్ని తెలుగుదేశం కార్యక్రమంగానే భావించారు.అందుకే ఆటంకాలు కలిగించారనే చర్చ సాగుతోంది. పాసుల జారీలో బాగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రాధాన్యత లేకుండా సంఖ్యను కుదించడం వెనుక కుట్ర దాగిఉందనే చర్చ సాగుతోంది. ఇదంతా పాలకపక్ష నేతల వ్యూహంతోనే నడిచిందనే కోణంలోనే ప్రచారం సాగుతోంది. ఈ వేడుకకు తెలుగుదేశం ముఖ్యనేతలు కూడా దూరంగానే ఉన్నారు. వేడుక ప్రాంగణానికి భారీగా చేరుకున్న అభిమానులను పాసులున్నా కూడా పోలీసులు అనుమతించలేదు.దీంతో అసంతృప్తిగానే వెనుదిరిగారు.సంఖ్యబాగా తగ్గించడం చర్చకు దారితీసింది.ఏదేమైనా జీవో నెంబరు 1 ప్రభావం ఈ కార్యక్రమంపైనా ప్రభావం చూపింది.

జగనన్న కాలనీలు డొల్లతనాన్ని సిపిఎం మరోసారి వెలుగులోకి తెచ్చింది.ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు జిల్లా నేతలతో కలిసి టంగుటూరు మండలం జమ్ములపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న జగనన్న కాలనీనిసందర్శించారు.అక్కడ సగంలో ఆగిపోయిన ఇళ్లను..పునాదుల్లోనే నిలిచిపోయి చిల్లచెట్లు మొలిసిన వాటిని పరిశీలించారు. ఒకరిద్దరు ఇళ్లు కట్టుకుంటున్నారు.వారితో మాట్లాడితే రూ.5 వడ్డీకి అప్పుతెచ్చి పునాదులు వేసుకుంటున్నామని వాపోయారు. ప్రభుత్వం ఇచ్చేవి పునాదులకు కూడా చాలవని చెప్పారు. జిల్లాలో మంజూరైన ఇళ్లలో పూర్తయిన ఇళ్ల గణాంకాలను సిపిఎంరాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మీడియాకు వెల్లడించారు.జగనన్న ఇళ్లు పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల హడావిడిచేసింది.డిశంబరులో గృహప్రవేశాలు పెట్టాలని కూడా నిర్ణయించారు.అయితే 10శాతం ఇళ్లు కూడా పూర్తికానందునే వాయిదా వేశారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులు నిర్మాణంలో నాలుగోవంతే. సెంటున్నరలో ఇల్లు పూర్తిచేయాలంటే కనీసం రూ.6లక్షలు ఖర్చవుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్లు పూర్తికావాలంటే ఇప్పటికైనా ఇంటికి రూ.5లక్షలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలను విడుదల చేసింది.జిల్లాలో 17,86,603 మంది ఓటర్లున్నారు.గతేడాది ఇదే సమయానికి ప్రకటించిన జాబితా కన్నా 6,298 మంది తగ్గారు.ఇదెంకు జరిగిందో అధికారులు ప్రకటించలేదు. ఏటికేడు జనాభాతోపాటు ఓటర్లు కూడా పెరగడం ఆనవాయితీ. ఈఏడాది తగ్గారు. ఇక ఓటర్లలో ఈసారి కూడా మహిళలే ఎక్కువగాఉన్నారు.పురుషులు 8,91,799 మందిఉండగా మహిళలు 8,94,684 మంది ఉన్నారు.ఇతరులు 120 ఉన్నారు.